# కలకానిది

## యన్.భవాని

మన ప్రపంచాన్ని విశాలం చేసుకునేందుకు మనకు దేముడు నోరు యిచ్చాడనుకున్నాను యింతకాలం. కాని దాన్ని నీవు ప్రపంచం జయించటానికే వాడుకోగల శక్తిని సంపాదించుకున్నావు. ఇక వద్దు! నా అవసరం లేకుండా నీవు ఎక్కడైనా బ్రతికేయగలవు. ఇక నా దగ్గర నీకు స్థానం లేదు. గో! ప్లీజ్ గెట్ అవుట్ అతని మాటలు చెవుల్లో రింగు రింగు మనటం మంచి మొదలయి యిప్పుడు హోరెత్తించేస్తున్నాయి. ఊపిరి ఆడనీకుండా చేసేస్తున్నాయి. బ్రతుకుమీద ఆశను చంపేసి నీవు ఒంటరిదానివి, అనాధవి" అని వేలెత్తి చూపిస్తున్నట్లుగా ఉన్నాయి. ఎప్పుడూ ఎరుగని భయాన్ని పుట్టిస్తున్నాయి.

"మేడమ్! మేడమ్" చుట్టూ చేరిన గుంపుల పలకరింపులతో ఈ లోకంలోకి వచ్చింది మైత్రేయి. "ఆటోగ్రాఫ్ మేడమ్" పుస్తకంమీద పుస్తకం పెట్టేసి చెయ్యి తిప్పుకోనీకుండా చేస్తున్న వాళ్ళ అభిమానానికి సంతోషంగా వున్నా మనసులో పొంగుతున్న లావా గుండెను మండించేస్తుంటే పెదవులమండి బలవంతంగా రావాలనుకుంటున్న చిరునవ్వు కూడా ఆ మంటకు కట్టుబడి అక్కడే ఆగిపోయింది. ఆమె మౌనంగా, యధాలాపంగా సంతకాలు పెట్టేస్తోంది. పోనీ సంతకాలే కదా పెడ్తే ఏం పోయింది! అని అనుకుంటూంటే వాళ్ళ ధర్మ సందేహాలు చిరాకు పరుస్తున్నాయి.

"మేడమ్! సినిమాలో మీరు కట్టే చీరలు మీవేనా లేక వాళ్ళు సెలక్ట్ చేసేనా?"

"మేడమ్! ఒక్కొక్క సినిమాకు ఎంత తీసుకుంటారు? కరెక్టుగా చెప్పండి?

"మీకు మేకప్ మీరే చేసుకుంటారా లేక మేకప్‌మానా, మగా? ఆడా?"

ఆమెకు సహనం చచ్చిపోయింది. ఇక భరించలేక "మోహన్" అని పెద్దగా అరిచింది.

"ఆ వచ్చేస్తున్నాను మేడమ్" ఆమె సెక్రటరీ మోహన్ పరుగెత్తుకు వచ్చాడు.

హంపీలో షూటింగ్ వుందని డైరెక్టరుగారు చెప్పినప్పుడు ఎగిరి గంతేసాడు మోహన్. "నేను వస్తాను మైత్రేయిగారూ!" అని బ్రతిమాలి ఆమెతో కలిసి వచ్చాడు. కానీ వచ్చిన ఆనందమే లేకుండా చేస్తోంది ఆమె. ఏమిటో సరధ్యానం! ఏమీ మాట్లాడదు. సరేనని యిద్దరూ షూటింగ్ అయ్యాక ఏకాంతంగా బయలుదేరారు ఊరు చూద్దామని. వచ్చినప్పటినుంచీ ఆమె మౌనం విసిగిస్తుంటే ఈ అభిమానుల బెడద ఒకటి.

చుట్టూ రాళ్ళు, కొండలు! సంధ్యా సమయం! ఏ రాయి చూసినా ఒక గుడి! దాన్ని నాటిని అలా మరచిన అమాయకపు మనస్తత్వాల తాలూకు పవిత్రమైన మలయ మారుతం మనసును రంజింప చేస్తుంటే "తంగు తంగు"మంటూ ఎడతెరిపి లేకుండా మ్రోగే గుడిగంటల రవళి జీవితంలో ఆశని చిగురింపచేస్తుంది. కొండల గుట్టలపై కూర్చుని చూస్తే చుట్టు ప్రకృతి అందమంతా తన సొత్తే అన్నట్లుగా దర్శనమిస్తుంది. ఎంత రసికత ఈ హంపీ దేవాలయంలో దాగుంది? అనుకుంది మైత్రేయి గుడి చుట్టూ చెక్కిన శిల్పాలలో దాగున్న శిల్పి మనస్తత్వాన్ని అంచనా వేస్తూ...

"మేడమ్! యింక టైమైంది! చీకటి పడింది! ప్రొడ్యూసర్‌గారు వెయిట్ చేస్తుంటారు. రేపటి షెడ్యూల్ గురించి డిస్కస్ చేయటానికి పదండి మేడమ్" మోహన్ తొందరపెట్టసాగాడు.

"రేపటి షెడ్యూల్" హహ! విరక్తిగా నవ్వుకుంది మైత్రేయి. ఈవేళ రాత్రి షెడ్యూల్‌కోసం వెయిట్ చేస్తాడు వాడు! వాడున్నంత కాలం నా బ్రతుకు వెళ్లుతుంది, తర్వాత?"

గుడి ప్రాంగణాలను వదలనంటున్న మనసును బలవంతంగా లాక్కుని ఆ అనుభవం తాలూకు పవిత్రతని ఆ గడపపైనే సమాధిచేసి తిరిగి పాత జీవితంలోని చేదు, పులుపు, కారాలవంటి నిష్ఠురమైన అనుభవాలను రొటీన్‌గా తలుపులు తెరిచింది. ప్రొడ్యూసర్‌గారి కౌగిలిలో నలిగినంతసేపు జీవితంలో పోగొట్టుకున్నదేదో, అందరికీ అందేది, కొందరికే అందనిది మనసును తొలిచేస్తు వుంటుంది. అదే దురదృష్టమంటే ! చేజేతుల చేసుకున్న స్వయంకృతాపరాధం.

"మోహన్! మళ్ళీ నాకు హంపీ దేవాలయం వెళ్ళాలని వుంది! ప్లీజ్! తొందరగా అరేంజ్ చేయి" సాయంత్రం ప్రయాణానికి ప్రొద్దున్నే బట్టలు సర్దేస్తు అంది. ఆశ్చర్యంగా చూసాడు మోహన్!

కెమెరాలో రీలు లోడ్‌చేసి మెళ్ళో వేసుకుంటూ "మరి బయలుదేరుదామా" అంది. ఇద్దరూ గెస్ట్‌హౌస్ బయటవున్న టాక్సీని మాట్లాడుకుని బయలుదేరారు. వీళ్ళ టాక్సీ ఆగిన చోటే ఏదో గుంపు ఒక మనిషిని చుట్టు ముట్టేసినట్లుగా అనిపించింది.

"మోహన్? ఏంటది?" ఆమె ఆ దిక్కుకేసి చూస్తూ అంది.

"ఒక్క నిమిషం! చూసివస్తాను" అతను వెళ్ళాడు.

ఆమె ఆశ్చర్యంగా చూస్తోంది. అతను తిరిగివచ్చి "మేడమ్! అతను సినీ ఆర్టిస్ట్ రూపేష్ కుమార్. ఒకే ఒక్క సినిమాలో నటించి జాతీయ అవార్డును కొట్టేసాడు. భలే గ్రేట్ కండీ!" మోహన్ చెప్పుకుపోతూ వున్నాడు అడ్మిరేషన్‌తో.

"రూపేష్‌కుమార్! తన ఫేవరేట్ హీరో! అద్భుతమైన నటన అతనిది. ఒక్క సినిమాతో కొన్ని లక్షల హృదయాలను దోచుకున్నాడు. తిరిగి ఎందుకు నటించలేదో కారణం తెలియదు తనకు. అతను నటించిన సినిమాను పిచ్చిగా పదిసార్లు చూసింది. అదే సినిమా "ఫిల్మోత్సవ్"లో కూడా పోల్గొని రష్యాలో కూడా ప్రదర్శింపబడింది. ఎన్ని సన్మానాలు! ఎంత పేరు అతనికి!

అతన్ని ఎలాగైనా కలవాలన్న ఆశ ఆమెలో మొదలైంది. అతన్నుంచి అతను నటించకపోవటానికి కారణం తెలుసుకుందామన్న కోర్కె బలంగా ఆమెను అతనివైపు నడిపించింది.

"ఒక్క నిమిషం! జరగండి! జరగండి! సూపర్‌స్టార్ మైత్రేయిగారు రూపేష్‌గారితో మాట్లాడాలి" మోహన్ జనాలను అడ్డుతొలగించసాగాడు. మైత్రేయి పేరు వినగానే అందరూ బుద్ధిగా పక్కకు తప్పుకుని ఆమెనే ఆశ్చర్యంగా చూడసాగారు.

అతను పలకరింపుగా నవ్వి "జస్ట్ ఎ మినిట్" అని గబగబా ఆటోగ్రాఫులు ముగించి వాళ్ళనుంచి బయటపడ్డా. ఆమె దగ్గరకు వచ్చి.

"రండి! మామూలుగా వీళ్ళ అభిమానం. ఒక్కోసారి మితిమీరిన అభిమానం తలనొప్పిని తెప్పిస్తుంది" అన్నాడు యిద్దరు గుడివైపే నడవసాగారు.

నెమ్మదిగా ఆమె మొదలుపెట్టింది సంభాషణ. అతను ఆసక్తిగా వినసాగాడు. మధ్యలో ఆపి "అవునూ! మీరు మళ్ళీ సినిమాల్లో ఎందుకు నటించలేదు?"

అతను చిన్నగా నవ్వి "మా ఆవిడకిష్టం లేదు. అందుకని"... ఎవరో ఈడ్చి చెంపమీద కొట్టినట్లైంది మైత్రేయికి.

"మీరు మీ ఆవిడకు అంత విలువనిస్తారా?" కొంచెం వ్యంగ్యం ధ్వనించింది.

అతను గుడి అరుగుమీద కూర్చుంటూ "అవును! ఆమె నా ప్రేరణ, జీవితం" అన్నాడు మైత్రేయి గుండె

నెమ్మదిగా ఆమె మొదలుపెట్టింది సంభాషణ. అతను ఆసక్తిగా వినసాగాడు. మధ్యలో ఆపి "అవునూ! మీరు మళ్ళీ సినిమాల్లో ఎందుకు నటించలేదు?" అతను చిన్నగా నవ్వి "మా ఆవిడకిష్టం లేదు. అందుకని"...

కలుక్కుమంది.

"మేము రాజావారి గెస్ట్‌హౌస్‌లో దిగాము. సాయంత్రం రండి. మా ఆవిడను పరిచయం చేస్తాను" అన్నాడు. అతని మాటలు పూర్తికాకుండా ఆమె మళ్ళీ ప్రశ్నించింది "మరి మీకు డబ్బు కావాలనిపించదా?"

"అంతకు మించినవెన్నో వున్నాయి మైత్రేయిగారూ జీవితంలో. అది కేవలం ముఖ్యమైనదే తప్ప డబ్బే జీవితం కాదు" సౌమ్యంగా అన్నాడు.

"మరి మీకు యిన్ని సన్మానాలు, సత్కారాలు, బిరుదులు వచ్చాయి కదా! వాటిని చూసైనా మీకు మళ్ళీ నటించాలనిపించలేదా?"

ఆమె అమాయకత్వానికి జాలి పడుతున్నట్లుగా చిన్నగా నవ్వాడు.

మైత్రేయి నాలిక్కొరుక్కుంది. ఎంత ఫూలిష్‌గా అడిగానా అని బాధపడ్తూ.

"మా ఆవిడ మెప్పుకోలు ముందు అవన్నీ నాకు లెక్కలేదు"

ఆమె విస్తుపోయింది. ఆమెలో సంచలనం మొదలైంది. యింతగా ఈయనను ముగ్ధుడ్ని చేసిన ఆ అపూర్వమైన, అసాధారణమైన స్త్రీ మూర్తి ఎవరో చూడాలి... చూడాలి..." అన్న కాంక్ష ఆమెను అక్కడ నిలవనీకుండా చేసింది. ఇక వెళ్తానన్నట్లుగా లేచి.

"మధ్యాహ్నం రెండింటికొస్తానండీ నేను. సాయంత్రం మా గ్రూప్ అంతా వెళ్ళిపోతున్నాం" అని నమస్కరించి బయలుదేరింది.

అతని రూం నంబర్ కనుక్కుని నెమ్మదిగా తలుపు తట్టింది. రూపేష్‌కుమార్ వచ్చి తలుపుతీసి సాదరంగా ఆమెను ఆహ్వానించాడు లోపలికి.

'ఇదుగోండి! ఈవిడే నా భార్య' మైత్రేయి తలతిప్పి చూసింది.


నెత్తిమీద పిడుగుపడ్డ అనుభూతి! ఆమెకు ఒక కాలు లేదు. వీల్ ఛైర్‌లో కూర్చుని ఒక పెయింటింగ్ చార్ట్‌మీద ఒక బొమ్మకు ఆకృతిని యివ్వడానికి ప్రయత్నిస్తోంది. మాటలు వినగానే యిటు తిరిగింది.

"మైత్రేయి అని సినీ ఆర్టిస్ట్" ఆమెకు పరిచయం చేసాడు. ఆవిడ నమస్కరించి కూర్చోమన్నట్లుగా కుర్చీ చూపించింది.

"మా ఆవిడ అద్భుతమైన చిత్రకారిణి!" సగర్వంగా చెప్పాడు రూపేష్.

"ఊ! సర్లెండి! ఆ ఎలా వుంది మీకు హంపీ?" నెమ్మదిగా ఆవిడే మాటల్లోకి దించింది. ఆమెతో మాట్లాడుతున్నంతసేపు తనో పెద్ద హీరోయిన్‌నీ, తనకు లక్షలకొద్దీ ఆస్తి వుందనీ మరచి ఎంతో అధమురాలిగా తనని తనే అంచనా వేసుకుంటూ మంత్రముగ్ధలా కూర్చుండి పోయింది. అప్పుడు అర్థమైంది ఆమెకు మగవాడు ఆడది చెప్పినట్లల్లా విని నడుచుకునే శక్తి కేవలం స్త్రీలోనే దాగుందని, అదే తనకు లేదని ఒక్క క్షణం తనను తనే ప్రశ్నించుకుంది.

"అహమా! నీ వెల ఎంత?" అని శపీమని అంతరాత్మ



జవాబిచ్చింది "నీ సుఖమంత" అని.

టైము చూసుకుంది. అరవుతోంది. ఇక వెళ్తానంటూ లేచి నిలబడగానే ఆమె "ఒక్క క్షణం ఆగండి! మా గుర్తుగా ఈ కాసెట్ ఉంచుకోండి" అని అందించింది. ఇద్దరికీ నమస్కరించి బయటకు నడిచింది.

"మోహన్ ఈ కాసెట్ పెట్టు" సాగిపోతున్న కారులో అందించింది మైత్రేయి.

"కల కానిది, విలువైనది, బ్రతుకు — కన్నీటి ధారలలోనే బలి చేయకు".

ఆమె కళ్ళు మూసుకుని వినసాగింది. ఇప్పుడు ఆమె మస్తిష్కంలో మెదిలేది ఒకే ఒక్క మనిషి — తనను పంచప్రాణంగా ప్రేమించి విడిచిన భర్త. తన హంపి ప్రయాణం తన జీవితాన్ని సరిదిద్ది తనలో చచ్చిపోయిన స్త్రీ మూర్తిని బ్రతికించి సజీవంగా యిలా తిరిగి పంపిస్తుందన్న విషయం తెలిసి మైత్రేయి ఆ ప్రదేశానికి పవిత్రంగా, మనస్ఫూర్తిగా కృతజ్ఞత తెలుపుకున్నది.

*